క్లుప్తంగా

ఘనంగా స్వామివారి గ్రామోత్సవం



కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని కాళ్ళకూరు గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తనది జలాభిషేక మహోత్సవాలు మంగళవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారిని గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి వారు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరణలో ఉన్న స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి అరుణ్ కుమార్ పర్యవేక్షించారు.

ప్రమాదభరితంగా ఎస్ టర్నింగ్ రోడ్డు



ఎస్ టర్నింగ్ వద్ద ప్రమాదభరితంగా ఉన్న సీసీ రోడ్డు

ఆకివీడు: మండలంలోని జాతీయ రహదారి నెం. 165లో స్థానిక ఎస్ టర్నింగ్ వద్ద రహదారి ప్రమాదభరితంగా తయారైంది. గతంలో ఈ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మించారు. సీసీ రోడ్డు పూర్తిగా ధ్వంసమవ్వడంతో రోడ్డులోపల వేసిన ఇనుప రాడ్లు బయటపడుతున్నాయి. ఇనుప రాడ్లు వాహనాలకు తగిలినా, వాహనం వెళ్లే సమయంలో పైకి లేచిపడినా తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు, వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో సీసీ రోడ్డును పునఃనిర్మించాలని, లేకుంటే మరమ్మతులు తారుతో వేసి గోతుల్ని పూడ్చాలని స్థానికులు మొరపెట్టుకుంటున్నారు. నిత్యం వేలాది వాహనాల రాకపోకలు జరిగే జాతీయ రహదారిలో పొంచి ఉన్న ప్రమాదంపై అధికారులు తక్షణం స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలు

పాలకోడేరు: మండల వ్యాప్తంగా బుధవారం నుంచి అక్టోబర్ రెండు వరకు ఆరోగ్యవంతమైన మహిళ – శక్తివంతమైన కుటుంబం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి. రెడ్డియ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యొక్క కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబం బలపరిచే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. దీనికి సంబంధించి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రింది తెలుపబడిన షెడ్యూల్ ప్రకారం 17న మోగల్లు-1, 18న పెన్నాడ -1, 19న విస్సాకోడేరు-2, 20న పీహెచ్సీ పాలకోడేరు, 22న విస్సా కోడేరు -1, 23న గోరగనమూడి, 24న పాలకోడేరు-2, 25న కుముదవల్లి, 26న నరసింహపురం, కె అన్నవరం, 27న గొల్లలకోడేరు, 29న పెన్నాడ -2, అక్టోబర్ 1న మోగల్లు -2 ఆయా గ్రామ పంచాయతీ వద్ద జరుగుతాయని తెలిపారు. ఈ వైద్య శిబిరాలను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆట వస్తువులు అలంకరణ కోసం కాదు

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రీజనల్ డైరెక్టర్ సుజాత

పెనుమంట్ర: అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన ఆట వస్తువులు అలంకరణ కోసం కాదని ప్రీస్కూల్ పిల్లలకు వినియోగించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రీజనల్ డైరెక్టర్ బి.సుజాతారాణి అన్నారు. మంగళవారం ఆమె పెనుమంట్ర మండలం ఎస్ ఇల్లిందలపర్రు-1, -2, జుత్తిగ-3, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ సిబ్బంది ప్రీస్కూల్‌లో నమోదుల సంఖ్య పెంచాలని, తల్లులు తమ పిల్లలను చేర్పించే విధంగా వారిలో అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లల బరువులు, ఎత్తులు, ఎప్పటికప్పుడు తూయాలని అనానరు. ఈ సందర్భంగా పిల్లల బరువు, ఎత్తులను ఆమె స్వయంగా పరిశీలించారు. రికార్డుల్లో ఉన్న తప్పుడు నమోదులను సరిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ ఎ.కృష్ణకుమారి, సూపర్‌వైజర్ వి.వరలక్ష్మి, ఆయా అంగన్‌వాడీ కార్యకర్తలు పి.కనకదుర్గ, టి.చిన్నమ్మ, వి.లక్ష్మి పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో చెత్త డంప్‌ను అరికట్టాలి

పెనుమంట్ర: సత్యవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వెలగలేరు శ్మశాన వాటిక స్థలాన్ని డంపింగ్ యార్డుగా వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని సత్యవరానికి చెందిన స్థానిక ప్రజా ప్రతినిధులు పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెలగలేరులో కొంత స్థలాన్ని గ్రామస్తులు శ్మశాన వాటికగా వినియోగిస్తున్నారని, ఇందులో చెత్తను డంప్ చేయడం వల్ల సత్యవరం గ్రామానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు గెడ్డం ఈశ్వరుడు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తమనంపూడి పల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బంగారు రెడ్డి, పాలా శ్రీను పాల్గొన్నారు.

ప్రయాణమంటే.. కలవరమే

- గ్రామాల్లో కానరాని సీసీరోడ్ల నిర్మాణం
- వర్షాలతో ధ్వంసమైన రహదారులు



ఎన్నార్పీ అగ్రహారం ఎస్సీకాలనీలో అత్యంత దారుణంగా మారిన మట్టి రహదారి



పెదపుల్లేరులో కనీసం రోడ్డు లేకపోవడంతో చిద్రమైన రహదారి

ఉండి: గ్రామాభివృద్ధిలో దూసుకుపోతాం, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం అంటూ ప్రగల్భాలు పలికిన పాలకులు కనీసం సీసీరోడ్లు వేయలేని స్థితిలో ఉండిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా గ్రామాల్లో సీసీరోడ్ల ఊసేలేదు. పలు గ్రామాల్లోని ఎస్సీ, బీసీ కాలనీల్లో అభివృద్ధి అంతంతమాత్రంగానే మారిపోయింది. ఆయా నియోజకవర్గాల్లోని గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణం జరిగిపోతుంటే నియోజకవర్గంలో మాత్రం ఇప్పటి వరకు వేసిన సీసీరోడ్లు చాలా అంటే చాలా తక్కువగా ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు. చాలా కాలం నుంచి సీసీరోడ్ల నిర్మాణం అదీ కాకపోతే కనీసం గ్రావెల్ రోడ్ల నిర్మాణం కోసం ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తుంటే కనీసం వాటిని కూడా పాలకులు నిర్మించలేకపోతున్నారు. చినుకుపడితే చాలు బురదమయంగా మారుతున్న మట్టిరోడ్లతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు నిర్మించండి మహాప్రభో అని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోని పాలకులను చూసి ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గ్రామాల్లో అంతర్గతంగా రోడ్ల ఇబ్బందులు అధికంగా ఉండటంతో కూటమి ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎన్నికల సమయంలో ప్రచారం చేసుకోవడం తప్ప చేసిందేమీ లేదంటూ విమర్శిస్తున్నారు. ఎంతో కాలంగా గ్రామీణ రోడ్ల కోసం ఎదురు చూసిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. ప్రస్తుత వర్షాకాలంలో మట్టిరోడ్లపై ప్రయాణం చాలా దారుణంగా ఉందంటూ ప్రజలు వాపోతున్నారు. ఓట్లు వేసిన ప్రజలను విస్మరించడం దారుణమని కనీసం గ్రావెల్ రోడ్లయినా వేస్తే బురద నుంచి తప్పించిన వారవుతారంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే గత ప్రభుత్వంలో సీసీ రోడ్ల నిర్మాణం జరిగిన తీరును ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో సీసీరోడ్ల సంగతి అటుంచితే గ్రామాల్లో కనీసం గ్రావెల్ రోడ్లు కూడా నిర్మాణం కావడం లేదని ఇదేమి ప్రభుత్వం అని పెదవి విరుస్తున్నారు.

చాలాకాలం నుంచి అడుగుతున్నాం



కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కాలం జరుగుతుంది. అయినా గ్రామాల్లో రోడ్లు వేయకపోవడం దారుణం. ప్రస్తుత వర్షాకాలంలో ప్రజల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఏదో చేస్తారని ప్రజలు ఎన్నుకున్నారు కానీ ఏమీ చేయకపోవడం చూస్తుంటే ఇక ముందు కూడా ఏమీ జరగదని తెలుస్తుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధినే ప్రజలు ఇప్పటికీ తలచుకుంటున్నారు.

–గలావిల్లి ధనుంజయ,
వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు, ఎన్నార్పీ అగ్రహారం

అభివృద్ధికి ఆమడదూరం



కూటమి పాలనలో గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం కలగానే మారిపోయింది. ఎన్నో గొప్పలు చెప్పి ఇప్పుడు సీసీరోడ్లు కూడా నిర్మించడం లేదంటే ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు.

–పీవీఆర్‌కే ఆంజనేయరాజు,
వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, ఎంపీటీసీ వాంద్రం

భారీ వర్షంతో జనజీవనం అస్తవ్యస్తం



వీరవాసరం- వడ్డిగూడెం ప్రధాన రహదారిపై పడిపోయిన భారీ వక్షం



హౌసింగ్‌బోర్డు, కాలనీలో నిలిచిపోయిన వర్షం నీరు



వర్షం నీటితో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికుడు

రోడ్లపై నిలిచిపోయిన నీటితో ప్రయాణీకుల పాట్లు

భీమవరం: భీమవరం పరిసర ప్రాంతాల్లో మంగళవారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. ఉదయం 6 గంటలకు వర్షం చినుకులుగా ప్రారంభమై తరువాత సుమారు మూడు గంటల పాటు ఎడతెరిపిలేకుండా భారీ వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు, బ్యాంక్ కాలనీలతో పాటు ఏఎస్‌ఆర్ నగర్, మెంటేవారితోట, నాచువారిసెంటర్, గునుపూడి, ఫైర్‌స్టేషన్ ప్రాంతాల్లో రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రయాణీకులు, ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షం కారణంగా రోడ్ల పక్కన తోపుడుబండ్ల వ్యాపారం చేసుకుని జీవించే చిరువ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. పట్టణంలోని గరగపర్రురోడ్డు, మెంటేవారితోట, ఎఫ్‌సీఐ తదితర ప్రాంతాల్లోని రైల్వే అండర్‌పాస్‌ల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వీరవాసరంలో భారీ వర్షం

వీరవాసరం: వీరవాసరం మండలం వ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం కురిసింది. సుమారు మూడు గంటల పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయానికి వెళ్లే ఉద్యోగులతో పాటు, విద్యార్థులు పాఠశాలకు వెళ్లే అవకాశం లేకుండా జోరుగా వాన కురుస్తూనే ఉంది. పల్లప్రాంతాల్లోని మురుగు డ్రెయిన్లు సైతం వర్షపు నీటితో నిండి కాలువలుగా మారాయి. వర్షాకాలం ప్రారంభమై ఇప్పటివరకు ఇంత వర్షం కురిసిన దాఖలాలు లేవని రైతులు, మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలు వరి పండించే రైతులకు ఎంతో అనుకూలంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. వీరవాసరం – వడ్డిగూడెం వెళ్లే ప్రధాన రహదారిపై రెండు భారీ వృక్షాలు నేలకూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని పలుచోట్ల విద్యుత్ స్తంభాలు గాలికి ఒరిగి విద్యుత్ అంతరాయం కలిగింది. సంబంధిత శాఖ అధికారులు తక్షణం స్పందించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. గ్రామాల్లో ఉన్న మురుగు డ్రెయిన్లను ప్రక్షాళన చేస్తే ఎటువంటి వర్షానికి అయినా రోడ్లు మునిగే పరిస్థితి ఉండదని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బొండాడ డ్రెయిన్‌లో తూడు, చెత్త తొలగించండి

ఉండి: మండలంలోని నియోజకవర్గ కేంద్రం ఉండిలోని అక్విడెక్టు వద్ద మేటలు వేసిన తూడు, చెత్తను వెంటనే తొలగించి యండగండి, ఉప్పులూరు గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో వరిపంటను కాపాడాలని యండగండి నీటి సంఘం సభ్యుడు పీవీఎస్ గాలకృష్ణంరాజు డ్రెయినేజ్ డీఈ, ఏఈలకు బుధవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనంతరం ఫిర్యాదు పత్రికలకు విడుదల చేశారు. మండలంలోని ఉప్పులూరు, యండగండి ప్రాంతాల్లో వరిచేలు తీవ్రంగా ముంపుబారిన పడుతున్నాయని వరిపంటను ముంపు నుంచి కాపాడేందుకు బొండాడ మేజర్ డ్రెయిన్‌లోని తూడె చెత్తను అత్యవసరంగా తొలగించాలని ఆయన అధికారులను కోరినట్లు తెలిపారు. బొండాడ డ్రెయిన్‌లోని మురుగునీరు ఎటువంటి ఆటంకాలు లేకుండా పారినట్లయితే వరిచేలల్లోని మురుగునీరు కూడా త్వరగా బయటకు వచ్చేయడంతో ఎంతభారీ వర్షం కురిసినా వరిపంట ముంపుకు గురికాదని తెలిపారు. కాబట్టి బొండాడ డ్రెయిన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కోరినట్లు గోపాలకృష్ణంరాజు తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

భీమవరం అర్బన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రేపాక వెంకన్నబాబు అన్నారు. భీమవరం మండలంలోని అనాకోడేరులోని డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రేపాక వెంకన్నబాబు మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో విచ్చలవిడిగా అడువులు నరికివేసి పరిశ్రమలు పుట్టగొడుగుల్లా నెలకొల్పడంతో సరికాదన్నారు. భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. అనంతరం చిత్రలేఖనంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. రాధామణి, కె. రాజేష్ కుమార్ రాజు, జీఎస్ విజయలక్ష్మి, ఎస్ ప్రేమరాజు, వి.ఆర్ ఎస్ఎస్ఎన్ మూర్తి, కె.గిరిజ రమాదేవి, ఎ. అరుణ కుమారి, సీహెచ్ జలాబాయి, వై. శకుంతల, ఎమ్ బాలపల్లాలరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కేవీకేలో మిద్దెతోటల పెంపకంపై శిక్షణ

ఉండి: మిద్దెతోటల పెంపకంపై బుధవారం నుంచి ఎన్నార్పీ అగ్రహారం కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లికార్జునరావు పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మిద్దెతోటల పెంపకం నిపుణుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో మిద్దె తోటల పెంపకం, గేనెటిగలు, కోళ్ళు, చేపల పెంపకంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే మిద్దెతోటల్లో బయోచార్ డింకంపోజర్స్ వినియోగం, తయారీపైనా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల మహిళలు, మిద్దెతోటల పెంపకందార్లు ఈ కార్యక్రమంలో పాలొగనాలని తెలిపారు.

బధిరుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



బధిరుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం

భీమవరం: బధిరుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఏలూరులో ఆదివారం జరిగిందని జిల్లా వైస్ ప్రెసిడెంట్ గనిశెట్టి శివ సత్య శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు ఒకటే సంఘం ఉండేదని అయితే ప్రస్తుతం ఏ జిల్లా కా జిల్లా కార్యవర్గం ఎన్నిక జరిగిందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఆర్. ఉమా మహేష్, ఉపాధ్యక్షుడిగా గనిశెట్టి శివ సత్య శ్రీనివాస్, వి.భాను అరవింద్, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎస్. జన్ని, జనరల్ సెక్రెటరీగా టి.రాము, జాయింట్ సెక్రటరీగా కే వరప్రసాద్, ట్రెజరర్‌గా వైదుర్గ వెంకట్ అఖిల్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా మరో ఆరుగురు సభ్యులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ అభివద్ధికి తమ కార్యవర్గం కృషి చేస్తుందని అలాగే ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలు కోసం పోరాటం చేస్తామన్నారు.

రైల్వే తాటిచెట్లను గీత కార్మికులకు ఇవ్వాలి



స్థానిక రైల్వే స్థలాల్లో సహజ సిద్ధంగా మొలిచిన తాడి చెట్లు

ఆకివీడు: సహజ సిద్ధంగా మొలిచిన తాడిచెట్లు ప్రభుత్వ స్థలాల్లోనూ, రైల్వే, పంట, మురుగు కాల్వల గట్లపై నిరుపయోగంగా ఉంటున్నాయని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నర్సింహమూర్తి మంగళవారం తెలిపారు. కల్లు గీత కార్మిక కుటుంబాలు ఉపాధి లేక అల్లాడుతున్నాయన్నారు. ఇటీవల కాలంలో రియల్ ఎస్టేట్ రంగం, ఇతర వ్యాపార రంగాలు, కట్టడాలతో ఖాళీ స్థలాల్లో తాడిచెట్లను నరికివేస్తున్నారని నర్సింహమూర్తి తెలిపారు. తాడిచెట్ల సంఖ్య తగ్గిపోవడంతో కల్లు తీయడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కల్లు గీత వృత్తిని ప్రభుత్వం గుర్తించి, తాడిచెట్ల నుంచి ఉచితంగా కల్లు తీసుకునే విధంగా ఉత్తర్వులు జారీ చేసిందని నర్సింహమూర్తి అన్నారు. రాష్ట్ర విభజనతో కల్లు గీత వృత్తి చతికలపడిపోయిందన్నారు. ప్రభుత్వ స్థలాల్లోనూ, రైల్వే స్థలాల్లో ఉన్న తాడిచెట్ల నుండి కల్లు తీసుకునేందుకు ఉచితంగా చెట్లను గీత కార్మికులకు అందజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పలు గ్రామాల్లో రైల్వే స్థలాల్లో తాడిచెట్లు సహజసిద్ధంగా పెరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ స్థలాల్లో గతంలో వేలంపాట ద్వారా కల్లు గీత చేపట్టేవారు. ఆ విధానానికి స్వస్తి చెప్పి తాడిచెట్లను ఆయా ప్రాంతాల్లోని గీత కార్మికులు కల్లు తీసుకునే అవకాశం కల్పించాలన్నారు. కల్లు మద్యంకు పోటీ కాదన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని నర్సింహమూర్తి విజ్ఞప్తి చేశారు.

ఏఎంసీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



ఏఎంసీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మార్కెట్ యార్డ్ కమిటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం బుధవారం మార్కెట్ యార్డ్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఏఎంసీ నూతన కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఏఎంసీ చైర్మన్‌గా కలిదిండి సుజాత రామచంద్రరాజు, వైస్ చైర్మన్‌గా బండి రమేష్ కుమార్, 13 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, మంత్రి నిమ్మల రామనాయుడు, రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు తదితరులు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికలు

భీమవరం: అండర్-14, 17 రైఫిల్ షూటింగ్ బాలురు, బాలికల ఎస్.జి.ఎఫ్ పోటీలు భీమవరంలోని చింతలపాటి బాపిరాజు పాఠశాల ఆవరణలో మంగళవారం జరిగాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తారని తెలిపారు. ఎస్. జి.ఎఫ్ కార్యదర్శులు పి.ఎస్.ఎన్. మల్లేశ్వరరావు, దాసరి సునీత ఉన్నారు.

ఓజోన్ పొరను రక్షించుకుందాం!



ఓజోన్ దినోత్సవం సందర్భంగా చిత్రలేఖనం పోటీలో విజేతలు



ఓజోన్ దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ఆకివీడు: ఓజోన్ పొర మనల్ని రక్షిస్తుందని, భూమి మీద నుంచి ఓజోన్ పొరను రక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని రసాయనిక అధ్యాపకురాలు డాక్టర్ ఏ. ఇందిర అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లోరో ఫ్లోరో కార్బన్స్ కారణంగా ఓజోన్ పొర నశించి, జీవ వైవిద్యం దెబ్బతింటుందని చెప్పారు. యూవీ కిరణాలు తీవ్రత వలన చర్మ సంబంధించిన క్యాన్సర్, కంటి చూపు కోల్పోవడం, పంటలు నాణ్యత కోల్పోవడం వంటి సమస్యలు ఏర్పడతాయని ఇందిర చెప్పారు. ఎక్కువ మొక్కలు నాటడం, ఏసీలు, ఫ్రిజ్‌ల వాడకం తగ్గించడం వలన ఓజోన్ పొరను కాపాడుకోవచ్చునన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీ.ఓగేశ్వరరావు మాట్లాడుతూ సూర్యుడు నుంచి వెలువడే అతి నీలలోహిత కిరణాలు నేరుగా భూమి మీద పడకుండా ఓజోన్‌పొర కాపాడుతుందన్నారు. రసాయనక పదార్థల వినియోగం, టవర్లు, రేడియేషన్, ఏసీలు, ఫ్రిజ్‌ల వాడకం, ఫ్యాక్టరీల నుండి వచ్చే రసాయినక పదార్థాలతో ఓజోన్‌పొరకు చిల్లుపడిందని చెప్పారు. కార్యక్రమంలో చిత్రలేఖనం, క్విజ్, వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతుల్ని అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

పాలకోడేరు: అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెండ్రలో ప్రధానోపాధ్యాయుడు జి.వీ.వీ.శ్రీనివాస్ అధ్యక్షతన పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఓజోన్ పొర సూర్యుని నుంచి వచ్చే అత్యంత ప్రమాదకరమైన అతి లీలలోహిత ఎలక్ట్రో మాగ్నేట్ కిరణాల నుంచి భూమిపై ఉన్న జీవరాశిని కాపాడే రక్షణకవచం అని, సరైన ఆలోచన లేకుండా మనం చేస్తున్న రకరకాల పనుల వల్ల పర్యావరణం పాడవుతుందని దాని ఫలితంగా ఓజోన్ పొర దెబ్బతింటుందని దాన్ని కాపాడుకోకుంటే భవిష్యత్తు అంధకారమయం అవుతుందన్నారు. ఓజోన్ పొర దెబ్బతినకుండా ఉండాలంటే పర్యావరణం కలుషితం కాకుండా చూడాలని ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు నేషనల్ గ్రీన్ కోర్‌అవార్డు గ్రహీత పంపన సాయిబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను ప్రతిఒక్కరూ నిషేధించాలన్నారు.

'దసరా విజయీభవ' బ్రోచర్ ఆవిష్కరణ



మావుళ్లమ్మ దేవస్థానంలో దసరా విజయీభావ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో ఈనెల 22నుంచి అక్టోబర్ 2వరకు విజయీభవ యాత్ర నిర్వహిస్తున్నట్లు మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థాన ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయంలో దసరా విజయీభావ బ్రోచర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2 వ తేదీ వరకు దసరా విజయీభావ యాత్ర నిర్వహిస్తామని, 22న మావుళ్లమ్మ ఆలయం వద్ద శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ, కలిగొట్ల గోపాల శర్మ, కొంద్రు శ్రీనివాస్, ఎస్ సత్యనారాయణ రాజు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.